తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శుక్రవారం
5 జూన్ 2026
పేజీలు : 08
Follow :

**శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్కిల్‌కు చెందిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) దాదాపు నెలన్నర రోజులుగా విధులకు హాజరు కావడం లేదన్న ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కార్యాలయానికి వచ్చే ప్రజలు, భవన నిర్మాణదారులు, వివిధ అనుమతుల కోసం ఎదురుచూస్తున్న అర్జీదారులు తమ పనులు నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ కార్యాలయంలో కీలక బాధ్యతలు నిర్వహించే అధికారి అందుబాటులో లేకపోవడం వల్ల పరిపాలనా వ్యవహారాలు మందగించినట్లు తెలుస్తోంది.**

# సారు.. జాడేది

## నెలన్నరగా ఏసీపీ గైర్హాజరు...

### శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్‌లో అయోమయం

- కార్యాలయానికి రాని ప్రధాన అధికారి
- పెండింగ్‌లో అనుమతులు, ఫిర్యాదులు
- అర్జీదారులను తిప్పిపంపుతున్న సిబ్బంది
- కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై అనుమానాలు
- పారదర్శక విచారణ కోరుతున్న ప్రజలు

**శేరిలింగంపల్లి, జూన్ 4 (జనంసాక్షి) :**

ఇటీవల శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడుల అనంతరం పరిస్థితులు మరింత మారిపోయాయని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. అప్పటి నుంచి సంబంధిత అధికారి కార్యాలయానికి క్రమం తప్పకుండా రావడం లేదని, అనారోగ్య కారణాలను చూపుతూ విధులకు దూరంగా ఉంటున్నారని కార్యాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన లేకపోవడం వల్ల ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన భవన నిర్మాణ అనుమతులు, ప్లాన్ ఆమోదాలు, అదనపు అంతస్తుల అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, వివిధ సాంకేతిక అనుమతులు వంటి అనేక అంశాలు ఏసీపీ స్థాయిలో పరిశీలనకు రావాల్సి ఉంటుంది. అయితే ప్రధాన అధికారి గైర్హాజరుతో ఈ ప్రక్రియలు నెమ్మదించినట్లు అర్జీదారులు ఆరోపిస్తున్నారు. కొందరు వారాల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా స్పష్టమైన సమాధానం దొరకడం లేదని చెబుతున్నారు.

కార్యాలయానికి వచ్చే వారికి సంబంధిత అధికారి అందుబాటులో లేరని, ఆయన వచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకోగలమని సిబ్బంది చెబుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. అత్యవసర అనుమతులు అవసరమైన సందర్భాల్లో కూడా ఫైళ్లను ముందుకు పంపడంలో ఆసక్తి చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో భవన నిర్మాణ రంగానికి చెందిన వారు, సీనియర్ సిటిజన్లు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.

ఇదే సమయంలో సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మాణ కార్యకలాపాలు మాత్రం యథావిధిగా కొనసాగుతుండటం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. గచ్చిబౌలి, కొండాపూర్, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాల్లో కొన్ని నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సాధారణ ప్రజలకు అనుమతులు ఆలస్యమవుతున్న సమయంలో కొన్ని నిర్మాణాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొంతమంది స్థానికుల అభిప్రాయం ప్రకారం, అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదుల పరిశీలనలో కూడా జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. ఫిర్యాదులు స్వీకరించడంలోనూ, వాటిపై చర్యలు తీసుకోవడంలోనూ స్పష్టత కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అంటున్నారు.

ఇప్పటికే శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ విభాగం వివిధ కారణాలతో వార్తల్లో నిలిచిన నేపథ్యంలో, ప్రధాన అధికారి దీర్ఘకాల గైర్హాజరు వ్యవహారం మరింత చర్చకు దారితీస్తోంది. ఒకవైపు ప్రజలకు సేవలు ఆలస్యమవుతుండగా, మరోవైపు నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతుండటంతో పరిస్థితిపై సమగ్ర సమీక్ష అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజలకు అందాల్సిన సేవలు అంతరాయం లేకుండా కొనసాగేందుకు ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు సర్కిల్ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర పరిశీలన నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరదించేందుకు సంబంధిత అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.





# కోహెడలో సీఎం సభకు భారీగా తరలిరండి

## కాంగ్రెస్ శ్రేణులకు పెద్ద అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు పండుగుల రాజు పిలుపు



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 4(జనం సాక్షి ):** ఈ నెల 6వ తేదీన శనివారం కోహెడలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని పెద్ద అంబర్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పండుగుల రాజు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పెద్ద అంబర్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగుల రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కోహెడలో అంతర్జాతీయ సమీకృత గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఈ మార్కెట్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల మద్దతు అవసరమని పేర్కొన్నారు. అందువల్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సిద్దెంకి కృష్ణారెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు నాగార్జున, కాంగ్రెస్ నాయకులు చామ విజయశేఖర్ రెడ్డి, గంట లక్ష్మారెడ్డి, సుప్రసేనా రెడ్డి, గంట శ్రీనివాస్ రెడ్డి, ఇటుకల మహేందర్ రెడ్డి, చెవుల హరిశంకర్, ఖలీం, డేవిడ్ వేణుగోపాల్ రెడ్డి, దాసరి నర్సింగ్ రావు, రాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు వడ్ల కొనుగోలులో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి



**శామీర్ పేట్, జూన్ 4(జనం సాక్షి )** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డి జి నరేందర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల బృందం కలిసి వ్యవసాయదారుల నుండి వడ్ల కొనుగోలు ప్రక్రియలోని సమస్యలను వర్షాకాలంలోపు వెంటనే పరిష్కరించాలని, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డికి వినతి పత్రం అంద జేశారు. రైతులు పండించిన వడ్ల కొనుగోలు ప్రక్రియలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల నిర్వహణలో లోపాలు, రవాణా సమస్యలు, గోనే సంచులు అందుబాటులో లేకపోవడం, హమాలీల కొరత, గోదాముల కొరత వంటి సమస్యల వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఐదు రోజుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ట్రాక్టర్లు రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో నిర్వహించడం విధితమే. ఆ చర్యతో షామీర్పేట్ ఎఫ్ ఎస్ సి ఎస్ నుండి రెండు లారీలు, అలియాబాద్ దాన్యం కొనుగోలు కేంద్రం నుండి ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించారు. రవాణా వాహనాలను అందుబాటు లో ఉంచాలి అని, వడ్ల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, రైతులు అమ్మిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు వీలైనంత త్వరితగతిన రైతులు అమ్మిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు వీలైనంత త్వరితగతిన బ్యాంకు ఖాతాలో జమ చేయాలని, మేడ్చల్ జిల్లాలోని తగినన్ని పెద్ద మిల్లులు ఏర్పాటు చేసి ఇక్కడ సేకరించిన ధాన్యాన్ని ఇక్కడ మిల్లులకే కేటాయిస్తే రవాణాకు తక్కువ సమయంలో ధాన్యం సేకరణ త్వరగా జరిగేందుకు ఆస్కారం ఉంటుందని డిజి నరేందర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. అత్యవసర వర్షాకాల స్వభావం కలిగి ఉన్నందున వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా డిస్ట్రిక్ మేనేజర్ ఎల్.సుగుణ బాయిని కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య, కార్యదర్శి నిమ్మల నరసింహ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.హెచ్ దశరథ , పి.నరసింహ, పి సత్యనారాయణ,స్థానిక బొంరాశి పేట్ రైతు సంఘం నాయకులు ఎం.శ్రీకాంత్ రెడ్డి, స్థానిక రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# 17 ఏళ్లుగా పూర్తికాని ఘట్‌కేసర్ ఆర్‌ఓబీ.. గిన్నిస్ రికార్డుకు ప్రతిపాదన

- 6,322 రోజులుగా సాగుతున్న నిర్మాణ పనులు
- ప్రపంచంలోనే అత్యధిక ఆలస్యమైన ప్రాజెక్టుగా గుర్తించాలని విజ్ఞప్తి
- గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కు లేఖ పంపిన బీజేపీ నేత ఏనుగు సుదర్శన్ రెడ్డి



**ఘట్‌కేసర్, జూన్ 4 ( జనం సాక్షి ):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌ఓబీ) పనులు దాదాపు 17 సంవత్సరాలు గడిచినా పూర్తికాకపోవడం స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఈ అసాధారణ జాప్యాన్ని ప్రపంచ రికార్డుగా గుర్తించాలని కోరుతూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్, లండన్‌కు వినతిపత్రం పంపినట్లు మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి తెలిపారు. షామీర్‌పేట్--ఘట్‌కేసర్ ప్రధాన రహదారిపై, సికింద్రాబాద్--కాజీపేట్ రైల్వే మార్గంలోని ఎల్‌సీ నంబర్-15 వద్ద నిర్మిస్తున్న ఈ ఆర్‌ఓబీకి 2009 ఫిబ్రవరి 11న పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. ప్రారంభంలో రూ.39 కోట్ల అంచనా వ్యయంతో 527.6 మీటర్ల పొడవుతో ప్రాజెక్టును చేపట్టినప్పటికీ, 17 సంవత్సరాల 3 నెలల 24 రోజులు గడిచినా పనులు పూర్తికాలేదని తెలిపారు. మొత్తం 6,322 రోజులుగా నిర్మాణ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ఇంకా పలు పనులు పెండింగ్‌లో ఉండటం ప్రజల్లో ఆగ్రహానికి కారణమవుతోందన్నారు. ఈ జాప్యం కారణంగా ఘట్‌కేసర్, షామీర్‌పేట్, హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాల ముప్పు, సమయ నష్టం, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు.

# పెద్ద అంబర్‌పేట్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పండుగుల రాజు



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 4 (జనం సాక్షి ):** నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ డివిజన్ (52) కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా పండుగుల రాజు నియమితులయ్యారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సహకారంతో ఆయనను డివిజన్ అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు డీసీసీ అధ్యక్షులు ప్రకటించారు. ఈ సందర్భంగా పండుగుల రాజు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు చేరవేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులను గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలి: టీజేఎఫ్



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 4(జనం సాక్షి ):** తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ జర్నలిస్టులను ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (టీజేఎఫ్) రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి పల్లె వెంకన్న కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2009 నుంచి 2014 జూన్ 2 వరకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం టీజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు సమిష్టిగా పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఉద్యోగులు, న్యాయవాదులు, ఆర్టీసీ కార్మికులు, ప్రజా సంఘాలతో కలిసి దీక్షలు, ర్యాలీలు, ధర్నాలు, అర్ధనగ్న ప్రదర్శనలు, ఢిల్లీలో ఆందోళనలు చేపట్టి తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతం చేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ నిర్ణయమని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేసిన జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేయడంతో పాటు ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమ జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై చర్చించేందుకు త్వరలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని పల్లె వెంకన్న వెల్లడించారు.

# ఘనంగా ముల్తాని బాబా ఉర్సు ఉత్సవ వేడుకలు



**శామీర్ పేట్, జూన్ 4(జనం సాక్షి )** శామీర్ పేట్‌లో సయ్యద్ జలాలుద్దీన్ ముల్తానీ బాబా ఉర్సు ఉత్సవం అత్యంత ఘనంగా జరిగినట్లు సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ తెలిపారు. నగరం నుండి మరియు చుట్టూ గ్రామాల నుండి ప్రజలు విచ్చేసి బాబాకు చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా ముందు శామీర్ పేట్ చెరువు వద్ద గల శామీర్ ఔలియా దర్గా కు భక్తులు వెళ్ళి సందల్ సమర్పించారు. ఆ తదుపరి సయ్యద్ జలాలుద్దీన్ ముల్తానీ బాబా దర్గాలో సందల్, మరియు చాదర్ సమర్పించారు. అనంతరం ప్రార్థనలు నిర్వ హించారు. మధ్య రాత్రి వరకు ఖవ్వాలీ కార్యక్రమం భక్తులను మంత్ర ముగ్దులను చేసింది. ఈ సందర్భంగా సీనియర్ ఉద్యమ కారులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ.. ఉర్సు ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారని నిర్వాహకులు వారికి భోజన సదుపాయం కూడా కల్పించారని తెలిపారు. భక్తులకు భోజన సదుపాయం కల్పించినందుకు, నిర్వాహకులకు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినందుకు పోలీసు సిబ్బంది కి అఫ్జల్ ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉర్సు ఉత్సవం లో అఫ్జల్ ఖాన్ తో పాటు నిర్వాహకులు మహ్మద్ మాజీ, దర్గా ను సుందరంగా తీర్చిదిద్దిన మహ్మద్ అఫ్జల్ షేక్ చాంద్ పాషా, మహ్మద్ ఇర్ఫాన్, షఫీయోద్దీన్, సమీ యోద్దీన్, మాజీ ఎంపిటిసి డపు సాయిబాబా, బుర్క వెంకటేష్,వంగ నర్సింహ రెడ్డి,ఇమ్తియాజ్ అహ్మద్, నిసార్ అహ్మద్ ఖాన్, షేక్ సాజిద్,అహ్మద్, సమీ, షోయబ్, మహ్మద్ నసీర్ ఖాన్,తయ్యబ్, ఖదీర్ ,మహబ్బూబ్ జానీ, అక్రమ్, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

# మేనిఫెస్టో హామీలను అమలు చేయాలి

- టిఆర్ఎస్ (డి) రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ.
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై టిఆర్ఎస్ (డి) మహాధర్నా.




**ముషీరాబాద్, జూన్ 04 (జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం చెందిందని తక్షణమే హామీలను అమలు చేయాలని తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్) రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్) పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు, ధాన్యం కొనుగోలు, రుణమాఫీ, రైతుబంధు అమలు సరిగా జరగడం లేదని, మహిళలకు 2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, 500 గ్యాస్ సిలిండర్ వంటి హామీలు నెరవేరలేదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, ఆసరా పెన్షన్లు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ యువత సంక్షేమం, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, నిరుద్యోగం, ధరల పెరుగుదల అధికమయ్యాయని, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్య, సాగునీటి రంగాలపై నిర్లక్ష్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్ గౌడ్, గోర్ల సోమయ్య, సింగం నాగేష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మైల సురేఖ, గద్దల లక్ష్మి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను పరిశీలించిన కాంగ్రెస్ నేత ముల్లి జంగయ్య యాదవ్

- పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచన
- వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశం



**ఘట్‌కేసర్, జూన్ 4 ( జనం సాక్షి ):** మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముల్లి జంగయ్య యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై పరిశీలన నిర్వహించి ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగమూర్తితో సమావేశమయ్యారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఆసుపత్రిలో వైద్య సేవల పరిస్థితిని సమీక్షించిన ఆయన, ప్రభుత్వం కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రజల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబించడం సరికాదని, ప్రజారోగ్య పరిరక్షణే ప్రతి వైద్య సిబ్బంది ప్రధాన బాధ్యతగా భావించాలని అన్నారు. అవసరమైన చికిత్సను స్థానికంగా అందించేందుకు కృషి చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఉన్నత వైద్య సేవలు అందించే గాంధీ ఆసుపత్రికి సకాలంలో రిఫర్ చేయాలని సూచించారు. అలాగే సిబ్బంది తమ విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, మైనారిటీ నాయకుడు కాయుమ్, యువజన అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, నాయకులు సత్తి రెడ్డి, అభిలాష్ యాదవ్, సాయి యాదవ్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాలా బాధితులకు అండగా నిలిచిన పరమేశన్న..!

- బాధితులతో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసిన పరమేశ్వర్ రెడ్డి
- "ఏ ఒక్కరికీ నష్టం లేకుండా నాలా రక్షణ గోడ నిర్మాణం చేపడతాం" -- కమిషనర్ హామీ



ఉప్పల్, జూన్ 4 ( జనం సాక్షి ): ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న నాలా అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి బాధితులకు అండగా నిలిచారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఉప్పల్‌లోని కావేరి నగర్ నుంచి నల్ల చెరువు వరకు ఉన్న నాలా అభివృద్ధి పనుల కోసం వ్యూహాత్మక నాలా అభివృద్ధి ప్రణాళిక కింద రూ.18 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో నాలాకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణం, వర్షపు నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ నేపథ్యంలో కావేరి నగర్, న్యూ భారత్ నగర్, హనుమాన్ నగర్, నార్త్ స్వరూప్ నగర్, సౌత్ స్వరూప్ నగర్ తదితర కాలనీలలోని పలు ఆస్తులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నాచారం పెద్ద చెరువు నుంచి ఉప్పల్ నల్ల చెరువు వరకు వర్షపు నీటి కాలువ నిర్మాణం చేపట్టనున్నందున, కొన్ని ఆస్తులు ప్రభావితమయ్యే అవకాశం ఉందని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నోటీసులు అందుకున్న కాలనీవాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తమ ఇళ్లు, స్థలాలు కోల్పోయే పరిస్థితి వస్తుందేమోనని భయపడుతూ, బుధవారం పరమేశ్వర్ రెడ్డి గారిని కలిసి తమ సమస్యలను వివరించారు. "దశాబ్దాలుగా ఇక్కడే నివసిస్తున్నాం. మా జీవితకాల పొదుపులతో నిర్మించుకున్న ఇళ్లు పోతే రోడ్డున పడాల్సి వస్తుంది. మాకు న్యాయం చేయండి" అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యను అత్యంత సీరియస్‌గా తీసుకున్న పరమేశ్వర్ రెడ్డి వెంటనే ప్రభుత్వ పెద్దల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. అనంతరం గురువారం బాధితులతో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వారి ఆందోళనలను వివరించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "అభివృద్ధి పనులు అవసరమే. అయితే ప్రజలకు నష్టం కలిగించే విధంగా అభివృద్ధి జరగకూడదు. ఏ ఒక్క కుటుంబం కూడా నిరాశ్రయులయ్యే పరిస్థితి రాకూడదు. రక్షణ గోడ నిర్మాణం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి ప్రజల ఆస్తులను కాపాడాలి" అని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, అధికారులు పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి, ప్రజలకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. "ఏ ఒక్కరికీ నష్టం లేకుండా, ఏ ఒక్క ఆస్తి పోకుండా పనులు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తాం. ప్రజల ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. కమిషనర్ హామీతో కాలనీవాసులు కొంత ఊరట చెందారు. తమ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, అధికారులతో చర్చించి భరోసా కల్పించిన పరమేశ్వర్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్, కావేరి నగర్, న్యూ భారత్ నగర్, హనుమాన్ నగర్, నార్త్ స్వరూప్ నగర్, సౌత్ స్వరూప్ నగర్ ప్రాంతాలకు చెందిన బాధితులు, స్థానిక నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజల కష్టాల్లో వారి పక్షాన నిలబడటం నా బాధ్యత. అభివృద్ధి పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తాం. ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు వారి కోసం పోరాడుతాం. ప్రజల కన్నీరు తుడవడమే ప్రజాప్రతినిధుల అసలైన ధర్మం" అని అన్నారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

- విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగం బోధనను తప్పనిసరి చేయాలి
- విజ్ఞాన దర్శని ఫౌండర్ రమేష్



ముషీరాబాద్, జూన్ 04 (జనం సాక్షి): విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించే పాఠ్యాంశాలను బోధించాలని, మత, కుల విభేదాలను ప్రోత్సహించే అంశాలను పాఠ్యపుస్తకాల నుంచి తొలగించాలని విజ్ఞాన దర్శని వ్యవస్థాపకులు, ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ మాజీ అధ్యక్షుడు రమేష్ అన్నారు. అలాగే విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగం బోధనను తప్పనిసరి చేయాలని సూచించారు. ఈ మేరకు గురువారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో రాష్ట్రస్థాయి విద్యా--వైజ్ఞానిక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 100 మంది విద్యార్థి ప్రతినిధులు ఈ శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ తరగతుల్లో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, విద్యార్థి ఉద్యమాల చరిత్ర, భారత చరిత్ర, శాస్త్రీయ విద్యావిధానం, మూఢనమ్మకాలపై అవగాహన, నాయకత్వ లక్షణాల పెంపుదల తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా "వైజ్ఞానిక ఆలోచన" అంశంపై ప్రసంగించిన రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వాలు విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించాల్సిన సమయంలో మత, కుల విభేదాలను పెంచే పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనా శక్తి తగ్గిపోతుందని అన్నారు. ప్రపంచం సాంకేతికంగా ఎంతో ముందుకెళ్తున్నప్పటికీ, భారతదేశంలో మూఢనమ్మకాలు పెరుగుతున్నాయని, విజ్ఞాన ఆధారిత ఆలోచనలకు ప్రాధాన్యం తగ్గుతోందని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యం కల్పించేందుకు మేధావులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి, రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు, సూరి, వెంకట్, గణేష్, సహాయ కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ జిల్లాల విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యాచరణ



**తాండూరు జూన్ 4(జనంసాక్షి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డ్ సభలు నిర్వహించారు. ఈ వార్డ్ సభలో రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై కార్యాచరణ ప్రణాళిక పై చర్చించడం, వర్షపు నీరు మురుగు కాలువల పూడికతీత, మీరు నిలవకుండా నివారణ చర్యలు, తాగునీటి సరఫరా, జల్ సంచాయి - జల్ భగీరథి, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటర్ జాబితాలో ప్రత్యేక సవరణ, వర్షాకాలంలో మొక్కల పెంపకం, వంటి అంశాలపై చర్చించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్షణ నేత్రం పోస్టర్లను విడుదల చేశారు. సీసీటీవీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి, కమిషనర్ పి. రాకేష్ రెడ్డి, కౌన్సిలర్లు బి. అనిల్ కుమార్,ఎం. ప్రత్యూష, నాగమణి, తాయాబ్ సుల్తానా, వార్డ్ ఆఫీసర్లు అనిల్ కుమార్, చంద్రశేఖర్, సాయి కృష్ణ, షఫీవుల, పోలీస్ శాఖ అధికారులు, అంగన్వాడి టీచర్లు, ఆర్పీలు, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ షెడ్డు నిర్మాణంపై విమర్శలు.. అధికారుల నిర్లక్ష్యమా?

**పోచారం, జూన్ 4 (జనం సాక్షి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడలో ఉప్పల్-వరంగల్ జాతీయ రహదారి పక్కనే భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతుండగా, దీనిపై స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులు గత మూడు నెలలుగా నిరంతరాయంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం నుంచి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, భారీ యంత్రాలు, వాహనాలు, కార్మికులతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నప్పటికీ, అధికారుల స్పందన మాత్రం ఆశించిన స్థాయిలో లేదని ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారిపై నిత్యం సంచరించే వివిధ శాఖల అధికారులకు ఈ నిర్మాణం కనిపించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని పలువురు పేర్కొంటున్నారు.



### అనుమతులపై నెలకొన్న సందేహాలు

ఈ నిర్మాణానికి సంబంధించి అవసరమైన అనుమతులు తీసుకున్నారా లేదా అనే అంశంపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ అనుమతులు లేకుండా నిర్మాణం కొనసాగుతున్నట్లయితే వెంటనే పనులను నిలిపివేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణమని తెలిసినా ఎందుకు ఉపేక్షిస్తున్నారనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. నోటీసులు జారీ చేశామని చెప్పడం తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### సమాన న్యాయం ఎక్కడ?

చిన్నపాటి నిర్మాణాల విషయంలో వేగంగా స్పందించే అధికారులు, భారీ స్థాయిలో సాగుతున్న ఈ నిర్మాణంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇంటి ముందు చిన్న షెడ్, మెట్లు లేదా ఇతర చిన్న నిర్మాణాల విషయంలో వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టే అధికారులు, జాతీయ రహదారి పక్కనే కొనసాగుతున్న ఈ నిర్మాణంపై మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోందని అభిప్రాయపడుతున్నారు. చట్టం అందరికీ సమానంగా అమలవ్వాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

### ప్రభుత్వ ఆదాయానికి గండా?

నిబంధనల ప్రకారం నిర్మాణ అనుమతులు తీసుకుంటే ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం సమకూరే అవకాశం ఉందని పట్టణాభివృద్ధి రంగ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే అనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగితే ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన వ్యవస్థే స్పందించకపోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

### ఉన్నతాధికారుల జోక్యం కోరుతున్న ప్రజలు

ఈ నిర్మాణంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన స్పందన లభించలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు న్యాయపరమైన మార్గాలను ఆశ్రయించినట్లు సమాచారం. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలు, అధికారుల వ్యవహార శైలిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఘట్కేసర్ సర్కిల్ పరిధిలో పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ప్రస్తుతం స్థానికంగా ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# శ్రీ తుల్జా భవాని దేవాలయ 10వ వార్షికోత్సవం జూన్ 7న



**తాండూరు జూన్ 4(జనంసాక్షి)** తాండూరు పట్టణంలోని ఇందిరానగర్ పటేల్‌కుంట (తుల్జాభవాని నగర్)లో వెలసిన శ్రీ తుల్జా భవాని దేవాలయ 10వ వార్షికోత్సవ వేడుకలు జూన్ 7 ఆదివారం ఘనంగా జరగనున్నాయి. శాలివాహన శక 1948 శ్రీపరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. త్రిశక్తిరూపిణి మంచాం, దుర్గాంచందీంసమాహ్వయంగా పిలిచే అమ్మవారికి ఉదయం 5:30 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. రోజంతా జరిగే పూజా కార్యక్రమాలు .ఉదయం 6 గంటలకు అభిషేకం ,ఉదయం 9:05 సామూహిక కుంకుమార్చన ఉదయం 10గంటలకు లలిత సహస్రనామ పారాయణం, మధ్యాహ్నం 1గంటకు అన్నదానం, సాయంత్రం 5గంటలకు పల్లకీ సేవ,రాత్రి 9గంటలకు గొందాలం, ధార్మిక కార్యక్రమాలు, మహానివేద్యం, మంగళ హారతి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ధర్మకర్త, శ్రీ తుల్జాభవాని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. తమ, మన, ధన రూపంలో ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# ఎఆర్ ఎల్ సంస్థల ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ సెమినార్

## ముస్లిం వెల్ఫేర్ స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ

**తాండూరు జూన్ 4(జనంసాక్షి)** విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించేందుకు బీదర్‌కు చెందిన ఎఆర్ ఎల్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అడ్మిషన్ అవేర్‌నెస్ అండ్ కెరీర్ గైడెన్స్ సెమినార్ 2026 ను నిర్వహించనుంది. ఈ కార్యక్రమం జూన్ 7, 2026 ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటలకు తాండూరులోని ముస్లిం వెల్ఫేర్ షాపింగ్ కాంప్లెక్స్, వివిహెచ్ ఎస్ రోడ్, మొదటి అంతస్తులో జరగనుంది.ముస్లిం వెల్ఫేర్ స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సెమినార్ జరుగుతోంది. నర్సింగ్, ఫార్మసీ, ఫిజియోథెరపీ, పారామెడికల్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు ఇది ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.కోర్సులు జిఎన్ యం , హెచ్ టిటిపి//బిఎస్సి నర్సింగ్, పోస్ట్‌హెచ్ టిటిపి//బి.ఎస్ సి నర్సింగ్, హెచ్ టిటిపి//యం.ఎస్ నర్సింగ్, బిపిటి, యంపిటి, బిఎస్ వైఎస్ ,బిఎయంఎస్, హెచ్ టిటిపి//డి.పారం ,హెచ్ టిటిపి//బిపారం తో పాటు మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, రేడియాలజీ, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, డయాలసిస్ టెక్నాలజీ వంటి పలు పారామెడికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.సౌకర్యాలు స్కాలర్‌షిప్ సహాయం, 100శాతం ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్, హాస్టల్ వసతి, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సుసజ్జితమైన ల్యాబ్‌లు, క్లినికల్ శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ పేర్కొంది.గుర్తింపుఎఆర్.ఎల్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు అనుబంధంగా ఉంది.కే.ఎన్.సి ,ఐఎన్.సి, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, పారామెడికల్ బోర్డు బెంగళూరు, కర్ణాటక ప్రభుత్వ గుర్తింపు పొందింది. 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. వైద్య రంగంలో కెరీర్ నిర్మించుకోవాలనుకునే విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సెమినార్‌కు హాజరై సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని నిర్వాహకులు కోరారు.

# ఈ నెల 7న తాండూర్ లో కాంగ్రెస్ పార్టీ బిఎల్ ఎల శిక్షణ కార్యక్రమం

## నియోజకవర్గ సార్ కన్వీనర్ కరణం పురుషోత్తం రావు

**తాండూరు జూన్ 4(జనంసాక్షి)** టీపీసీసీ అధిష్టానం ఆదేశాల మేరకు తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచనతో గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూర్ నియోజకవర్గ సార్ కన్వీనర్ కరణము పురుషోత్తం రావు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఓటర్ జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ సార్ కార్యక్రమంపై అవగాహనా కల్పించడానికి తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 7న ఆదివారం ఉదయం 10:00 గంటల నుండి తులసీ గార్డెన్స్ తాండూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ ఎల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని నిశ్చయించారు. ఈ సమావేశంకు ముఖ్య అతిథిగా సార్ రాష్ట్ర కన్వీనర్,పరిగి ఎమ్మెల్యే టి. రాం మెహన్ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారసింగ్ , టీపీసీసీ తరుపున సార్ పై అవగాహనా కల్పించడానికి పలువురు ట్రైనర్స్ కార్యక్రమంకు హాజరు కానున్నట్లు తెలిపారు.తాండూర్ నియోజకవర్గంలో ఉన్న 269 పోలింగ్ బూత్స్ లో గల పోలింగ్ ఏజెంట్స్ మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు, మండల,గ్రామ, మున్సిపల్ వార్డు పార్టీ అధ్యక్షులు,ఆత్మ కమిటీ చైర్మన్,మార్కెట్ కమిటీ చైర్మన్స్, వైస్ చైర్మన్స్,




పిఏసిఎస్ చైర్మన్స్, వైస్ చైర్మన్స్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, తో పాటు పాలక వర్గ సభ్యులు,కౌన్సిలర్స్,సర్పంచ్ లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు,సీనియర్ నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సార్ ఉన్న సందేశాలు, సార్ ప్రకియ పూర్తి సమాచారం బిఎల్ ఎల వివరించడం జరుగుతుందని అన్నారు.అలాగే గ్రామ స్థాయిలో సార్ పై ఏవిధమైన సమస్యలు ఉన్న శిక్షణ కార్యక్రమంలో అడిగి పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ మెంబర్స్, మున్సిపాల్ వైస్ చైర్మన్, మర్కేట్ కమిటీ, ఆత్మ కమిటీ చైర్మన్స్,వైస్ చైర్మన్స్,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మెక్‌డొనాల్డ్స్ ఇండియా కొత్త ప్రచారం

## 'లెట్స్ ఫ్యామిలీ ఎట్ మెక్‌డి' ఆవిష్కరణ

**ఖైరతాబాద్, జూన్ 04 (జనం సాక్షి) :** దేశంలో 30 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భం గా మెక్డోనాల్డ్స్ ఇండియా వెస్ట్ అండ్, సౌత్ నిర్వ హణ సంస్థ వెస్ట్ లైఫ్ ఫుడ్ వరల్డ్ 'లెట్స్ ఫ్యామిలీ ఎట్ మెక్‌డి' పేరుతో కొత్త బ్రాండ్ ప్రచారాన్ని ప్రారం భించింది. ఈ ప్రచారంలో ప్రముఖ గీత రచయిత ప్రసూన్ జోషి రచించిన ప్రత్యేక బ్రాండ్ గీతం ప్రధా న ఆకర్షణగా నిలిచింది. ఎంసీ కాన్ ఇండియా రూ పొందించిన ఈ ప్రచారం, కుటుంబం అనే భావన ను సాంప్రదాయ పరిమితులను దాటి స్నేహితులు, సహోద్యోగులు, సంఘాలు వంటి అనుబంధాల వరకు విస్తరించి, ఐక్యతను వేడుకగా జరుపుకుం టోంది. ఈ సందర్భంగా అక్షయ్ జాటియా మాట్లా డుతూ గత మూడు దశాబ్దాలుగా మెక్‌డొనాల్డ్స్ భారతీయుల దైనందిన జీవితంలో భాగమైందని 'లెట్స్ ఫ్యామిలీ ఎట్ మెక్‌డి' ద్వారా నేటి భారత దేశంలోని విభిన్న కుటుంబ బంధాలను గౌరవిస్తు న్నామని తెలిపారు. ప్రసూన్ జోషి మాట్లాడుతూ కుటుంబం అనేది కేవలం రక్త సంబంధం కాదని, మనతో అనుబంధం కలిగిన ప్రతి వ్యక్తి కుటుంబ మేనని పేర్కొన్నారు. రాహుల్ మాథ్యూ మాట్లా డుతూ ఆధునిక కుటుంబాల విస్తృత నిర్వచనాన్ని ప్రతిబింబించేలా ఈ ప్రచారాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రచారం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, స్టోర్ అనుభవాల ద్వారా దేశవ్యాప్తంగా అమలు కానుంది. ప్రచారానికి క్రియేటివ్ ఏజెన్సీగా ఎంసీ కాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్‌గా ఆయింక్ ప్రొడక్షన్ సంగీతం కోసం విశాల ఖురానా మీడియా భాగ స్వామిగా స్టారకామ్ ఇండియన్ వ్యవహరించాయి .

# పుట్టపహాడ్ జెడ్పి పాఠశాలలో బడిబాట ప్రారంభం

**కుల్కచర్ల,జూన్ 04(జనం సాక్షి):** మండల పరిధిలోని పుట్టపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేందర్ బహదూర్ ఆధ్వర్యంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మహేందర్ బహదూర్ మాట్లాడుతూ..ప్రవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉంటాయని గ్రామంలో తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులకు చెప్పారు.ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, రెండు జతల దుస్తులు, మధ్యాహ్నం భోజనం, చక్కటి విద్యాబోధన ఉంటుందని తెలిపారు. ప్రవేట్ పాఠశాలల్లో ఫీజుల మోతనే తప్ప, చదువు ఏమి లేదని అన్నారు.కావున పిల్లలను తప్పకుండా ప్రవేట్ పాఠశాలకు




పంపకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపాలని చేతులెత్తి వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తాం: గవర్నర్



**సికింద్రాబాద్(జనం సాక్షి):** దివ్యాంగ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడం అత్యంత ముఖ్యమని, వారి ప్రతిభను గుర్తించి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. క్రీడాకారులకు ఉద్యోగాలు లేదా ఆర్థిక సహాయం అందించడం మాత్రమే సరిపోదని,వారిలో ఆత్మవిశ్వా సాన్ని పెంపొందించే ప్రోత్సాహం అవసరమని గవర్నర్ సూచించారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బేగంపేట్ లోని ఆదిత్య మెహతా ఫౌండేషన్ రిహబిలిటేషన్ సెంటర్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సెంటర్ ద్వారా శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన ప్యారా అథ్లెట్లను ,శిక్షణ పొందుతున్న క్రీడాకారులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడారు. దేశ ప్రధానమంత్రి కూడా విదేశాల్లో ఉన్నప్పటికీ భారత క్రీడాకారులతో మాట్లాడి వారిని ఉత్తేజపరుస్తారని గుర్తుచేశారు. అలాంటి ప్రోత్సాహమే క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపి విజయాల దిశగా నడిపిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే క్రీడాకారులకు సహకారం అందిస్తోందని, ఈ క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్తానని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారైనా తెలంగాణలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు తమ వారేనని, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలపై ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మరింత సహాయం అందించే అంశంపై కూడా చర్యలు తీసుకుంటామని గవర్నర్ వెల్లడించారు. కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా, పారా ఒలింపిక్ రంగంలో సేవలందిస్తున్న మల్లికా నడ్డా వంటి వారు దివ్యాంగ క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రశంసించారు.కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా క్రీడాకారులను, ముఖ్యంగా మహిళా క్రీడాకారులను ప్రోత్సహించాలని మీడియా ద్వారా పిలుపు నిచ్చారు. క్రీడాకారులందరూ తమ ప్రతిభ, క్రమశిక్షణ, కృషితో దేశానికి మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు అంతర్జాతీయ ప్యారా అథ్లెటిక్ క్రీడాకారులకు అధునాతన టెక్నాలజీతో రూపొందించిన స్పోర్ట్స్ సైకిళ్ళు, నగదు పురస్కారాలను గవర్నర్ అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారుల విజయాలను అభినందించిన గవర్నర్, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ జైహింద్, జైభారత్ అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సినీనటి మంచులక్ష్మి, ఆదిత్య మెహతా ఫౌండేషన్ ట్రస్ట్ శిల్పారెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి అంజనా సిన్హా, డాక్టర్ ఏ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ అందించడం విద్యా సంస్థల బాధ్యత

### మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, జూన్ 4 (జనం సాక్షి)** ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ లోని సత్య నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయి కృప ప్లే స్కూల్ ప్రారంభోత్సవానికి స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ అందించడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని అన్నారు. చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి ప్లే స్కూల్స్ ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యారంగంలో సేవాభావంతో ముందుకు వస్తున్న సాయి కృప ప్లే స్కూల్ యాజమాన్యాన్ని అభినందిస్తూ, ఈ విద్యాసంస్థ మరెన్నో విజయాలు సాధించి ప్రాంతంలోని చిన్నారులకు ఉత్తమ విద్యను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, నాయకులు నర్సింహా, శక్తి సింగ్, మధు సుధన్ రెడ్డి, సుబ్బారెడ్డి, స్కూల్ సిబ్బంది, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలే ఆరోగ్యానికి పునాది యువతే దేశ భవిష్యత్తు

### మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్




**హయత్ నగర్, జూన్ 4 (జనం సాక్షి)** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ నగర్ జోన్ బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధి లోని ఎన్జీవోస్ కాలనీ చత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో గత నెల రోజులుగా నిర్వహించిన ఎం ఎం సి సమ్మర్ కోచింగ్ క్యాంపు -- 2026 ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని, వివిధ క్రీడా విభాగాల్లో శిక్షణ పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతో ఐఏఎస్, డిప్యూటీ కమిషనర్ స్వామి, బిజెపి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బీఎన్ రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వేసవి సెలవు లను సద్వినియోగం చేసుకుంటూ శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. వివిధ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి, సత్కరించారు. విజేతలను అభినందిస్తూ భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి తమ తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. "క్రీడలే ఆరోగ్యానికి పునాది -- యువతే దేశ భవిష్యత్తు" అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎం ఎం సి ఇంజనీరింగ్ విభాగం ఈ ఈ నాగేంద్ర, డి ఈ కనకయ్య, ఏ ఈ విగ్నేశ్వర, స్పోర్ట్స్ ఇన్స్పెక్టర్ విగ్నేష్, హయత్ నగర్ బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, హయత్ నగర్, బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, బి.యన్.రెడ్డి డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు క్రాంతి గౌడ్, నూతి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శంకరయ్య గౌడ్, రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులు భార్గవ్ తేజ, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్నాద్, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, నాయకులు నరేష్ యాదవ్, నాయిని శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రావు, మధుసూదన్ రెడ్డి, విజయ్, యోగి, కిషోర్, నాగేష్, సిద్దేశ్వర్, అధికారులు, క్రీడా శిక్షకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు బడులు వద్దు... ప్రభుత్వ బడి ముద్దు

- విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి
- 98% పాఠ్యపుస్తకాలు వచ్చాయి
- మండల విద్యాధికారి హరిలాల్




**బొంరాస్ పేట, జూన్ 4(జనం సాక్షి):** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి హరిలాల్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు, ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ఉదయము అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. ఈనెల 12 నుండి పాఠశాలలో పునః ప్రారంభం కావడం జరుగుతుందని, మండలానికి 98 శాతం పాఠ్య పుస్తకాలు రావడం జరిగిందన్నారు. మాయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు తీసుకెళ్లాలని కోరారు. మొత్తం మండల వ్యాప్తంగా 46 పాఠశాలలకు గాను 30 పాఠశాలల ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కులవృత్తుల అభివృద్ధిలో సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయి

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**నిజాంపేట్ జూన్ 4( జనం సాక్షి)** కుత్బుల్లాపూర్ మండల్ స్వర్ణకార సంఘం నూతన కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదటి రోజు నుంచి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుల వృత్తుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వివిధ సంక్షేమ పథకాలతో కులవృత్తులపై ఆధారపడి ఉన్న వారికి చేయూతనిస్తూ ఆదుకోవడం జరిగిందని, కులవృత్తుల అభివృద్ధికి పాటుపడిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ క్రమంలోనే గత 12 ఏళ్ల కాలంలో స్వర్ణ కారులతోపాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేశామని, రానున్న రోజుల్లో కూడా కులవృత్తుల అభివృద్ధిలో నా సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏవీ శేషాచారి, నూతన అధ్యక్షులు చొల్లేటి శ్రీనివాస్ చారి, ప్రధాన కార్యదర్శి ఎస్. నారాయణ చారి, కోశాధికారి శ్రీరామోజు మురళీధర్ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరామయ్య చారి, సలహాదారులు గుండవెల్లి నాగేశ్వర్ చారి, సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్ చారి, ఉప సంయుక్త కార్యదర్శి కృష్ణ చారి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంసి పల్లిలో ప్రజా పాలన ముగింపు వేడుకలు



**శామీర్ పేట్, జూన్ 4(జనం సాక్షి )** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం రోజు మూడు చింతల పల్లిలో ముగింపు వార్డు సభ నిర్వ హించారు.ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ జాము రవి, వైస్ ఛైర్మన్ మోర్సుబాయి శశిరేఖ, స్థానిక కౌన్సిలర్ ర్యాకల నీరజ్ గౌడ్,గిరిపల్లి రమేష్ పాల్గొని మూడు చింతలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్మన్ జాము రవి అన్నారు. ఈ కార్య క్రమంలో కమిషనర్ వెంకట గోపాల్, మేనేజర్ ఉషా, రెవెన్యూ ఆఫీసర్ అర్షద్ అహ్మద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రెడ్డి,అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ, ఏఎస్ఇ రమేష్ గౌడ్,హార్టికల్చర్ ఆఫీసర్ వెంకట రమణ, ఇందిరమ్మ ఇండ్లు ఏఈ కమలాకర్, శాని టేషన్ ఇన్స్పెక్టర్ మోహన్ సింగ్ , మెప్మా నర్సింలు, నాయకులు వెంకట నరసింహారెడ్డి, మహిళా సంఘాలు,పలు శాఖల అధికారులు, గ్రామస్తులు మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎఫ్‌సి నగర్ పిట్టల ఆర్గానిక్స్‌కు జాతీయ గుర్తింపు-వైయస్సార్



**ఘట్కేసర్, జూన్ 04 (జనం సాక్షి)** ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థుల పరిశోధనలు ఢిల్లీ, ముంబై విద్యార్థుల బృందాల సందర్శనతో పిట్టల ఆర్గానిక్స్ ప్రత్యేక ఆకర్షణ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది: ఏనుగు సుదర్శన్ రెడ్డి. రైతులకు అవసరమైన మౌలిక సహకారం అందించి ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయాలి మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ డివిజన్ చీఖీజ నగర్‌లో ఉన్న పిట్టల ఆర్గానిక్స్ వ్యవసాయ క్షేత్రాన్ని ఈరోజు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. ఢిల్లీలోని అంబేద్కర్ యూనివర్సిటీ విద్యార్థులు, ముంబైతో పాటు పిలాని ప్రాంతానికి చెందిన విశ్వవిద్యాలయ విద్యార్థులు తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే ప్రకృతి వ్యవసాయ విధానాలపై పరిశోధనలో భాగంగా పిట్టల ఆర్గానిక్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పిట్టల ఆర్గానిక్స్ ఫౌండర్ పిట్టల శ్రీశైలం కి విద్యార్థులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ రంగంలో వినూత్న ప్రయోగాలు చేస్తూ ప్రకృతి వ్యవసాయానికి ఆదర్శంగా నిలుస్తున్న పిట్టల ఆర్గానిక్స్‌లో పరిశోధనలు నిర్వహించడం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని శ్రీశైలం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేయడం ఘట్‌కేసర్ ప్రాంతానికి గర్వకారణమని అన్నారు. పిట్టల ఆర్గానిక్స్ వంటి వ్యవసాయ క్షేత్రాలు రైతులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం రైతులకు ఇచ్చే హామీలకే పరిమితం కాకుండా, రైతులకు నిజంగా అవసరమైన సౌకర్యాలు, సాంకేతిక సహకారం మరియు ప్రోత్సాహకాలను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం కనుమరుగవుతున్న సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రైతు సేంద్రియ ఎరువుల ఆధారంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తే ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందడంతో పాటు రైతులకు కూడా అధిక లాభాలు చేకూరుతాయని తెలిపారు. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు భవిష్యత్ వ్యవసాయానికి దిక్సూచిగా నిలుస్తాయని ఏనుగు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

# వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు చర్యలు

**కాప్రా, జూన్ 4 (జనం సాక్షి) :** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని టీజీ ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ రమేష్ తెలిపారు. చర్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నెలకొన్న లో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు నాగార్జున కాలనీలోని 8 ఎం వి ఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ ను 12.5 గా మార్చారు. నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ ను గురువారం ఎస్ఈ వెంకన్న తో కలిసి చీఫ్ ఇంజనీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగిన నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని తెలిపారు. లో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు



పాత విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల స్థానంలో నూతన ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీంతో నాగార్జున నగర్ పరిసర ప్రాంతాల్లో లోవిద్య సమస్య తీరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైనిక్పురి డి ఈ అన్వర్ భాష, చర్లపల్లి ఏడిఈ రాందాస్, ఏఈలు బాల్ రాజు, రామకృష్ణ విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రావి నారాయణ రెడ్డి ఆశయాలు యువతకు ఆదర్శం



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 4(జనం సాక్షి ):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి నాయకత్వం వహించిన మహానేత, స్వాతంత్ర్య సమరయోధుడు, నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి 118వ జయంతి సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నాగోల్ సర్కిల్, పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని భూపోరాట కేంద్రం పేదల సమూహం గుడిసెల వద్ద ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి రావి నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్రచారి మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం రావి నారాయణ రెడ్డి చేసిన పోరాటాలు, త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన మహోన్నత నాయకుడిగా ఆయనను కొనియాడారు. భూపోరాటాల ద్వారా అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో, ముఖ్యంగా నల్లగొండ ప్రాంతంలో వేలాది ఎకరాల భూమిని పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు పంపిణీ చేయించారని తెలిపారు. తన వాటాగా వచ్చిన 400 ఎకరాల భూమిని కూడా పేదల కోసం దానం చేసిన ప్రజానాయకుడిగా ఆయన నిలిచారని గుర్తుచేశారు. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే అధిక ఓట్లు సాధించిన అరుదైన నాయకుడిగా రావి నారాయణ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం నేటి నాయకులు కృషి చేయాలని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, సామిడి శేఖర్ రెడ్డి, మండల పార్టీ సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహా, మండల కార్యవర్గ సభ్యులు పొన్నాల యాదగిరి, కాటి అరుణ, తైలి మధు, డౌల రాములు, సైదులు ముదిరాజ్, గోపి, వినోద్, ఆవుల యాదగిరి, శాయిని వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావుని
# కలిసిన బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



**నిజాంపేట్ జూన్ 4( జనం సాక్షి)** మాజీ మంత్రివర్యులు హరీష్ రావు పుట్టినరోజు సందర్భంగా గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ .ఈ సందర్భంగా పూల బొకే ఇచ్చి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



**కేశంపేట, జూన్ 4 (జనం సాక్షి ):** రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఎంపీవో దయానంద్ అన్నారు. మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామంలో సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ అధ్యక్షతన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, మంచినీటి నిర్వహణ, హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పెంచడం, జల సంరక్షణ, వ్యవసాయ రైతుల రిజిస్ట్రేషన్, ఓటర్ జాబితా సవరణ తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ హరితహారం కార్యక్రమంలో భాగస్వాములై మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పరిశుభ్రతను పాటించడం ద్వారా అంటు వ్యాధులను నియంత్రించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి ప్రసాద్, వార్డు సభ్యులు ఎదిరే నాగేశ్వర్, పిప్పల్ల నరేందర్, పిచ్చకుంట్ల శిరీష, తుడుం కృష్ణయ్య పాల్గొన్నారు.

## శ్రీ దుర్గా బార్ అండ్ రెస్టారెంట్‌లో కుళ్లిపోయిన మాంసం నిల్వలు



**తాండూరు జూన్ 4 (జనంసాక్షి)** స్థానికంగా ఉన్న శ్రీ దుర్గా బార్ అండ్ రెస్టారెంట్‌లో కుళ్లిపోయిన మాంసాహారాన్ని నిల్వ ఉంచినట్లు అధికారుల తనిఖీల్లో బయటపడింది. ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే ఈ చర్య ఆహార భద్రతా నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని అధికారులు పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో రెస్టారెంట్‌లో నిల్వ చేసిన మాంసం కుళ్లిపోయి, దుర్వాసన వెదజల్లుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి ఆహార పదార్థాలను వినియోగించడం వల్ల ఫుడ్ పాయిజనింగ్, ఇతర తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఘటనపై తదుపరి చర్యల నిమిత్తం అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన రెస్టారెంట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ రాములు తెలిపారు. ప్రజలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. తనిఖీల్లో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ రాములు , ఎన్విరాన్మెంట్ ఇంజినీర్: ప్రవీణ్ కుమార్, శానిటరీ జవాన్స్ సిబ్బంది ఉన్నారు.

## ఖాతాదారులను ఇబ్బందులు పెట్టకుండా బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్య వైఖరి వీడాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య
- సిఐటియు జిల్లా కోశాధికారి బుస్స చంద్రయ్య



**బొంరాస్ పేట, జూన్ 4 (జనం సాక్షి):** ఖాతాదారులను ఇబ్బందులకు గురి చేస్తూ బ్యాంకు మేనేజరు నిర్లక్ష్యం చేయడం పట్ల గురువారం వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమము స్థానిక ఎస్బిఐ బ్యాంకు ముందు చేపట్టారు.అనంతరం స్థానిక బ్యాంకు మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య మాట్లాడుతూ బాధిత ఖాతాదారుని బ్యాంకు ఖాతా సైబర్ ఫ్రాడ్ పేరుతో రెండు నెలలుగా ఫ్రిజ్ చేసి ఉంచినప్పటికీ సరైన వివరణ ఇవ్వకుండా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడం సరైనది కాదన్నారు.ఇదే విషయమై ఈనెల 13న బాధితుడు బ్యాంకు మేనేజర్ ఆదేశాల మేరకు లావాదేవీల పూర్తి వివరణ, స్టేట్మెంట్ అవసరమైన పత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోలేదని వాపోయారు.సిఐటియు జిల్లా కోశాధికారి బుస్స చంద్రయ్య మాట్లాడుతూ సాధారణ ఖాతాదారుల సమస్యలను నెలల తరబడి పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు.మేనేజర్ నిర్లక్ష్యం వల్ల పేద గ్రామీణ సాధారణ ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ఇప్పటికైనా ఖాతాదారులను ఇబ్బందులు పెట్టకుండా మెరుగైన సేవలు అందించాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బాధితులు రమేష్, బీములు, సూర్తి బాయి, రాజు, నరేష్ ,అవినాష్ ,అనంతయ్య రాములు తదితరులు ఉన్నారు.

## అనంతగిరి అటవీ ప్రాంతంలో పర్యావరణ వారోత్సవాలు



**వికారాబాద్ జూన్ 4 (జనంసాక్షి)** పర్యావరణ పరిరక్షణ బాధ్యతను భావి తరాలకు అందించే లక్ష్యంతో, వికారాబాద్ జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో అనంతగిరి అటవీ ప్రాంతంలో 'పర్యావరణ వారోత్సవాలు' అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు మరియు పోటీలను ఏర్పాటు చేశారు.

### విద్యార్థుల కోసం పోటీలు

ఈ వారోత్సవాల్లో భాగంగా 'పర్యావరణ పరిరక్షణ' మరియు 'గ్లోబల్ వార్మింగ్' అనే అంశాలపై వ్యాసరచన మరియు డ్రాయింగ్ పోటీలు జరిగాయి. తాండూరు, వికారాబాద్ మరియు ధారూర్ మండలాల పరిధిలోని కేరెల్లి పాఠశాలలకు చెందిన సుమారు 40 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని, తమ సృజనాత్మకతను చాటుకున్నారు.

### అడవిపై అవగాహన - ఫారెస్ట్ ట్రెక్

పోటీల అనంతరం, అటవీ శాఖ అధికారులు విద్యార్థులను అటవీ ప్రాంతంలో పర్యటనకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అధికారులు అడవిలో లభించే అరుదైన వృక్ష జాతులు, పక్షుల విశిష్టత మరియు పర్యావరణ సమతుల్యతలో అడవుల పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.గెలుపొందిన వారికి జూన్ 12న కలెక్టరేట్ లో బహుమతి ప్రధానం చేస్తున్నట్లు రేంజ్ ఆఫీసర్ తెలిపారు.కార్యక్రమం పాల్గొన్న ప్రముఖులుఈ కార్యక్రమంలో వికారాబాద్ ఎఫ్.ఆర్.ఓ కె. శ్యామ్ కుమార్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి. నాగేశ్వరరావు, ఎఫ్.బి.ఓ ఎం. రాజు నాయక్ పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.అలాగే, కవయిత్రి మొల్ల కళావేదిక తాండూరు ఫౌండర్ మరియు సోషల్ వర్కర్ కె.వి.ఎం వెంకట్, కె.జి.బి.వి ఎస్.ఓ పెద్దేముల్ రాజేశ్వరి, సత్య సాయి సేవా సమితి కేరెల్లి ప్రతినిధులు వెంకట్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, సాయి కుమార్, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.చిన్నతనం నుంచే విద్యార్థులలో పర్యావరణం పట్ల బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**బీవీజీ ఫౌండేషన్ చైర్మన్, బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ సంపత్ కుమార్**



**తాండూరు జూన్ 4 (జనంసాక్షి)** తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. బీవీజీ ఫౌండేషన్ చైర్మన్, తాండూర్ బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ సంపత్ కుమార్ స్వయంగా కలిసి పుష్పగుచ్చం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోర్వార్ నగేష్, వడ్డే శ్రీనివాస్, కోట వెంకటేష్ తదితరులు పాల్గొని గడ్డం ప్రసాద్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## నార్సింగ్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా లక్ష్మారెడ్డి బాధ్యతల స్వీకరణ



**రాజేంద్రనగర్,జూన్4(జనంసాక్షి)** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల అమలుతో పాటు శానిటేషన్, రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తానని నార్సింగ్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి తెలిపారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ఉత్తర్వుల మేరకు గురువారం జి. లక్ష్మారెడ్డి నార్సింగ్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. గత 10 సంవత్సరాలుగా సచివాలయంలో వివిధ హోదాల్లో సేవలందించిన ఆయన, వడ్డేపల్లి, జడ్చర్ల, దేవరకద్ర, భూత్పూర్, ఐజా ప్రాంతాల్లో కమిషనర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా జనంసాక్షి ప్రతినిధితో మాట్లాడుతూ, నార్సింగ్ సర్కిల్ పరిధిలో శానిటేషన్ వ్యవస్థను మరింత మెరుగుపర్చడంతో పాటు రెవెన్యూ, ఆస్తి పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాల అమలుపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

## లింగన్ పల్లిలో బడిబాట




**బొంరాస్ పేట, జూన్ 4 (జనం సాక్షి):** మండల పరిధిలోని లింగన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు శ్రీహరి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడిలో ఇంగ్లీష్ మీడియం విద్య బోధించడం జరుగుతుందని ప్రైవేటు పాఠశాలల వ్యామోహం వీడాలని తల్లిదండ్రులను కోరారు.

## సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ




**దోమ జూన్ 4 (జనం సాక్షి)** దోమ మండల కేంద్రంలో సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని ఆయా శాఖల గురించి అవగాహన ప్రజలకు కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దోమ గ్రామంలో చేసిన పలు పనులపై మాట్లాడారు. వీధి దీపాలు, అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు పలు సూచనలు తెలిపారు. ఎస్ఐ వసంత్ జాదవ్ మాట్లాడుతూ ఆన్లైన్ మోసాలు గురించి మహిళల సంరక్షణ, బాల్య వివాహాలు, ఆన్లైన్ లోన్స్ మోసాల గురించి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోవిందమ్మ, మండల వైద్యాధికారి రజిత, పంచాయతీ కార్యదర్శి జీవామృత, జీపిఓ, వార్డ్ మెంబెర్స్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విఓఏలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శామీర్‌పేట నూతన తహసీల్దార్‌గా శ్రీనివాస్



**శామీర్ పేట్, జూన్ 4(జనం సాక్షి )** ఏలాంటి అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ ఆదేశాల నియమాలను,విధులను బాధ్యతగా, పారదర్శకంగా నిర్వర్తిస్తానని నూతన తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. శామీర్ పేట తహసీల్దార్ గా పని చేసిన సుచరిత గత నెల మే 25న నాలా కన్వర్శన్ రెవిన్యూ పని చేయడానికి రైతుల నుంచి రూ. 30 లక్షల ను డిమాండ్ చేసి రూ. 2 లక్షల లంచం తీసుకుంటుండగా డ్రైవర్ తోపాటు తహసీల్దార్ సుచరిత ను ఏసీబీ అధికారులు వల వేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని అరెస్ట్ చేసి జైలుకు పంపగా సంచలనం అయిన విషయం విదితమే. అప్పటి నుంచి ఖాళీ అయిన శామీర్ పేట తహసీల్దార్ స్థానంలో గురువారం నూతన తహసీల్దార్ గా సి హెచ్ . శ్రీనివాస్ నియమితులై శామీర్ పేట రెవెన్యూ కార్యాలయంలో ఛార్జ్ తీసుకుని బాధ్యతలను చేపట్టారు. ఈయన తెలంగాణ రాష్ట్ర మైన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లో జనరల్ మేనేజర్ గా పని చేస్తు మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు బదిలీ పై శామీర్ పేట తహసీల్దార్ గా నియమితులయ్యారు. శామీర్ పేట మండలంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటు ప్రభత్వ నియమ నిబందలన మేరకు పని చేస్తానని కొత్తగా శామీర్ పేట తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ వివరించారు. కార్యాలయంలో రెవిన్యూ పనులను పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేస్తానని అయన వెల్లడించారు. అలాగే మండలంలోని ప్రభుత్వ భూములను అక్రమ కబ్జా కాకుండా పర్యవేక్షిస్తూ బాధ్యతగా కాపాడుతానని తహసీల్దార్ తెలిపారు.





## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**మొయినాబాద్, జూన్ 4 (జనంసాక్షి):** వికారాబాద్ ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్)లో తెలంగాణ శాసనసభ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల సమన్వయ కమిటీ సభ్యులు కోమిడి వెంకట్ రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య, కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఏక్ లవయ్య, సంగం రాష్ట్ర అధ్యక్షులు కుర్కుల కృష్ణ, క్లూటుడే న్యూస్ ఛానల్ ఎడిటర్ ఠాకూర్ సూరజ్ సింగ్, మొయినాబాద్ నాయకులు దేవరాపల్లి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొని ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గడ్డం ప్రసాద్ కుమార్ నాయకత్వంలో వికారాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ప్రజా సేవలో ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. వేడుకలు సామరస్యంగా, ఉత్సాహభరితంగా జరిగాయి.

## అభివృద్ధికి ప్రజలు భాగస్వాములు కావాలి

- మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ షాబాద్ సోనియా దర్శన్
- హిమాయత్ నగర్ మున్సిపల్ వార్డు కార్యాలయంలో వార్డు సభ




**మొయినాబాద్,జూన్ 04, జనంసాక్షి:** మున్సిపల్ అభివృద్ధికి ప్రజలు భాగ్యస్వాములు కావాలని, మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ షాబాద్ సోనియా దర్శన్ అన్నారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లోని మున్సిపల్ వార్డు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ షాబాద్ సోనియా దర్శన్ హాజరయ్యారు. వార్డులలో పరిశుభ్రత, డ్రైనేజీ, వీధిదీపాలు, మంచి నీటి, మౌలిక వసతులు వంటి అంశాలపై వివరించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ షాబాద్ సోనియా దర్శన్ మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులోని ప్రజలు పరిశుభ్రతను పాటించాలని అన్నారు. రానున్న వర్షకాలం కావడంతో వార్డులోని ప్రజలు డ్రైనేజీలో చెత్తచెదారం వేయకుండా జాగ్రత వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్లు బేగంబి, బిల్లాపాటీ కవిత ఎల్లేష్, షాబాద్ కిషన్, పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్, ఆయా సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

### సమ్మర్ క్యాంపుల ద్వారా యువత

## క్రీడలవైపు మొగ్గు చూపాలి

**అడిషనల్ కమిషనర్ సుభద్ర**



**శేర్లింగంపల్లి, జూన్ 04 (జనంసాక్షి) :** సమ్మర్ క్యాంపులను సిఎంసి నిర్వహించడం ఎంతో శుభసూచకమని, ఇలాంటి క్యాంపుల ద్వారా యువత శిక్షణను అందుకోవడంతోపాటు క్రీడల వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందని స్పోర్ట్స్ విభాగం అడిషనల్ కమిషనర్ సుభద్ర తెలియజేశారు. ఈ మేరకు చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో గురువారం సిఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమ్మర్ కోచింగ్ క్యాంప్ - 2026' ముగింపు వేడుకలలో శేరిలింగంపల్లి జోనల్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ శశిరేఖ తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడలలో ప్రాతినిధ్యం వహిస్తూ విజేతలుగా నిలిచినవారికి అతిథులు బహుమతుల ప్రధానం చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ పి జె ఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు నెల రోజులపాటు ఘనంగా నిర్వహించుకోవడం హర్షనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగపర్చుకోవడం శుభ సూచకమన్నారు. ఏప్రిల్ 25న ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ మే 31 వరకు నిర్విఘ్నంగా కొనసాగిందని, క్రీడలు, వ్యాయామాన్ని అలవర్చుకోవడంద్వారా మనిషి జీవితంలో చదువు, సంపాదనతోపాటు శారీరక ధారుడ్యం, మానసిక ఉల్లాసం లభిస్తాయన్నారు. సమ్మర్ క్యాంపులో పుల్లెల గోపిచంద్, పివి సింధు ఇలాంటి వేదికల ద్వారా శిక్షణను తీసుకొని అంతర్జాతీయ వేదికల పై ఎన్నో అత్యుత్తమ పథకాలు సాధించి వారు ఉంటున్న ప్రాంతంతోపాటు భారతదేశ కీర్తి పతాకాన్ని ఎగురవేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం సమ్మర్ క్యాంపు లలో శిక్షణ తీసుకుంటున్న వారుకూడా మన అంతర్జాతీయ ఆటగాళ్లను ఆదర్శంగా తీసుకుని ఉజ్వల భవిష్యత్తును పొందడం ద్వారా తమ తల్లిదండ్రులకు, దేశానికి గొప్ప పేరు తేవడానికి కృషి చేయాల్సిన అవసరాన్ని ఎత్తి చూపారు. ఈ కార్యక్రమంలో నాయకులు , అక్బర్ ఖాన్, ఓ వెంకటేష్, నరేందర్ బల్లా, రాహుల్, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి అనాథ విద్యార్థులకు పుస్తకాలు యూనిఫామ్ పంపిణీ
- వచ్చే జన్మదినం క్యాబినెట్ మంత్రిగా నిర్వహించుకోవాలి
- జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేమారెడ్డి

**మోమిన్ పేట జూన్ 04( జనం సాక్షి)** వచ్చే జన్మదినోత్సవ వేడుకలు తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మంత్రిగా జన్మదినోత్సవ వేడుకలు జరుపుకుంటారని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేమారెడ్డి జోష్యం చెప్పారు గురువారం శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా మోమిన్ పేట మండల కేంద్రంలో కేక్ కట్ చేసి అనాథ పిల్లలకు పుస్తకాలు దుస్తులు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ శాసన సభాపతిగా ప్రసాద్ కుమార్, జన్మదినోత్సవ వేడుకలు, జరుపుకున్న ఆయనకు వచ్చే సంవత్సరం సంవత్సరం జన్మదినోత్సవ నాటికి తెలంగాణ రాష్ట్ర హోం శాఖ మంత్రిగా నిర్వహించుకుంటారని ఆయన అన్నారు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పని చే స్తారని, ఆయన గుర్తు చేశారు శాసన సభాపతిగా రెండున్నర సంవత్సరాలు, శాసనసభ గౌరవాన్ని పెంచిన మహోన్నత వ్యక్తి గడ్డం ప్రసాద్ కుమార్ అని ఆయన అన్నారు, శాసనసభ స్పీకర్ పదవి కంటే సామాన్య ప్రజలకు అవసరపడే హోంశాఖ మంత్రి పదవిని కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గానికి ఆయన కోరినట్లు తెలుస్తుంది ఈ కార్యక్రమంలో అమ్రాధి కలాం సర్పంచ్ శంకరప్ప మాజీ సర్పంచులు సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బందయ్య బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మేస్త్రీల సంఘం సంక్షేమం కోసం మేస్త్రీలు ఏకం కావాలని పిలుపు



**కాప్రా, జూన్ 4, (జనం సాక్షి) :** మేస్త్రీల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ఇంటి నిర్మాణ పనులను బంద్ చేస్తున్నట్లు కాప్రా, కీసర, ఘట్కేసర్ మండలాల మేస్త్రీల సంఘం పిలుపునిచ్చింది. సెంట్రింగ్ కాంట్రాక్టర్ల ధరల పెంపు, ఇతర చర్యలను నిరసిస్తూ, గురువారం పద్మశాలి టౌన్షిప్‌లో మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో మూడోరోజు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మేస్త్రీలు పాల్గొని మేస్త్రీల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం పలువురు రాష్ట్రస్థాయి మేస్త్రీలు మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలై భవన నిర్మాణాలు చేపడుతున్న మేస్త్రీలు, బిల్డర్లు నష్టాల పాలవుతున్నారన్నారు. ఇప్పటికే కోట్లల్లో పెట్టుబడి పెట్టిన భవన నిర్మాణం మేస్త్రీలు కట్టిన ఇల్లులు అమ్ముడుపోక అప్పుల ఊబిలో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ధరలు పెంచి పనులు నిర్వర్తించకపోవడం దారుణం అన్నారు. అయితే వారి చర్యలకు వ్యతిరేకంగా తాము సైతం తమ పనులను బందు చేస్తున్నామని తెలిపారు. మేస్త్రిల సంఘం తీర్మానించిన ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరు పనులు చేసిన రూ.25 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మేస్త్రీల ఐక్యతతోనే సమస్యలను పరిష్కరించుకోవచ్చని పిలుపునిచ్చారు. త్వరలో మేస్త్రి సంఘం కమిటీని ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సుమారు 500 మంది మేస్త్రిలు పాల్గొన్నారు.

## అత్తాపూర్‌లో 13 మంది రౌడీ షీటర్లు బైండోవర్

- భవిష్యత్తులో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా మంచి ప్రవర్తన కొనసాగించాలి
- రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్



**రాజేంద్రనగర్, జూన్4(జనంసాక్షి) :** శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన 13 మంది రౌడీ షీటర్లను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. బైండోవర్ చేయబడిన వారిలో ఎం.ఎం. పహాడీకి చెందిన మహమ్మద్ మోయినుద్దీన్, సయ్యద్ జకరియా అహ్మద్ అలియాస్ షాఫెజ్, ఎండి. అలీ ఖాన్, ఇమాద్ నగర్‌కు చెందిన మహమ్మద్ షాబాజ్ ఖాన్, మహమ్మద్ అజ్మత్, మహమ్మద్ ఒమర్, మహమూద్ నగర్‌కు చెందిన ఎండి. ఖదీర్, మహమ్మదాబాద్‌కు చెందిన ఎండి. యాసీన్, ఎస్కా కుర్బాన్, సులేమాన్ నగర్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్, మహమ్మద్ యూసుఫ్ అలియాస్ యూసుఫ్ మాము, మహమ్మద్ షరీఫ్, కిషన్‌బాగ్‌లో నివాసముంటున్న షేక్ రషీద్ ఉన్నారు. భవిష్యత్తులో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా మంచి ప్రవర్తన కొనసాగించాలని వారికి హెచ్చరికలు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# ‘99 ప్రణాళిక’తో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

- మేడిపల్లి నక్కర్తలో ఘనంగా గ్రామ సభ
- మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం
- అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు ప్రాధాన్యం
- ప్రజల సమస్యలు నేరుగా స్వీకరించిన సర్పంచ్



**యాచారం, జూన్ 4 (జనంసాక్షి):** యాచారం మండలం మేడిపల్లి నక్కర్త గ్రామ పంచాయతీ కార్యాలయంలో ‘99 ప్రణాళిక’లో భాగంగా గురువారం గ్రామ సభను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, గ్రామ పంచాయతీ కార్యదర్శి లత సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామాభివృద్ధే ఏకైక లక్ష్యంగా, ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో స్థానిక సమస్యల పరిష్కారానికి మరియు రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువల మెరుగుదల, తాగునీటి సరఫరా క్రమబద్ధీకరణ, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య పనులు వంటి కీలక అంశాలపై గ్రామస్థుల నుంచి అభిప్రాయాలు, వినతులు సేకరించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ మాట్లాడుతూ, 99 ప్రణాళిక ద్వారా మేడిపల్లి నక్కర్త గ్రామాన్ని మండలంలోనే అన్ని రంగాల్లో ముందంజలో ఉంచి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ పాలకవర్గం ఎల్లప్పుడూ ముందుంటుందని, వార్డు సభ్యులు, ప్రజలంతా కలిసికట్టుగా సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామ కార్యదర్శి లత మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, రాబోయే అభివృద్ధి పనుల ప్రణాళికలను సభలో వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పనిని పారదర్శకంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామస్థులు వ్యక్తపరిచిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో రికార్డు చేసి, నిధుల లభ్యతను బట్టి త్వరితగతిన పరిష్కరిస్తామని సర్పంచ్, కార్యదర్శి హామీ ఇచ్చారు. ఈ గ్రామ సభకు ఉపసర్పంచ్ మధుకర్ రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ మక్కపల్లి స్వరూప, వార్డు సభ్యులు మమత, జ్యోతి, అనిల్, మహేష్, మనోహర్, పద్మ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల చురుకైన భాగస్వామ్యంతో సభ విజయవంతంగా ముగిసింది.



## ఘనంగా చల్లా వంశీచంద్ రెడ్డి జన్మదిన వేడుకలు

### యువతకు స్ఫూర్తి ప్రదాతగా వంశీచంద్ రెడ్డి

**తలకొండపల్లి, జూన్ 04 (జనంసాక్షి):** తలకొండపల్లి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మాజీ ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శాలువాతో సన్మానించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చల్లా వంశీచంద్ రెడ్డి చేస్తున్న కృషిని నాయకులు కొనియాడారు. యువతకు నిరంతర స్ఫూర్తిగా నిలిచే వంశీచంద్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాసరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర కిసాన్ సెల్ నాయకులు మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజయ్య గుప్తా సునంద, అజీమ్ ఆమనగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్, డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, మైనారిటీ మండల అధ్యక్షులు ఆరిఫ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చెన్నకేశవులు, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్, మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచులు రమేష్, శంకర్, ఆవాంచ నరసింహారెడ్డి, సర్పంచ్ మహేందర్, పబ్బతి వెంకటయ్య, ఫరీద్, రామ్మోహన్ రెడ్డి, రాజేందర్, శంకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హబ్సిగూడలో తాగునీటి తీవ్ర కొరత

- అక్రమ మోటార్లతో నీటి దోపిడీ
- జలమండలి-పోలీసుల సంయుక్త తనిఖీలు
- అక్రమ మోటార్లు స్వాధీనం
- కఠిన చర్యలు తప్పవని జీఎం హెచ్చరిక
- ప్రజలు సమస్యలు వెల్లడించి ఆందోళన



**హబ్సిగూడ, జూన్ 4 (జనంసాక్షి):** హబ్సిగూడ ప్రాంతంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. జలమండలి ద్వారా క్రమం తప్పకుండా నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ, కొందరు వ్యక్తులు అక్రమంగా మోటార్లు అమర్చి నీటిని అధికంగా లాగేయడం వల్ల పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కాలనీల చివరి భాగాలు, ఎత్తైన ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు తీవ్ర కష్టాలు పడుతున్నాయి. నిర్ణీత సమయానికి కుళాయిలు వచ్చినా కొద్ది నిమిషాల్లో నీటి ఒత్తిడి తగ్గిపోవడంతో తాగడానికి, వంటకు, నిత్యావసరాలకు కూడా నీరు అందడం లేదని మహిళలు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మోటార్ల ద్వారా నీటిని పెద్దఎత్తున లాగేస్తున్నందున సహజ ఒత్తిడితో వచ్చే నీటి ప్రవాహం తగ్గిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నా రు. ఫలితంగా వందలాది కుటుంబాలు ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో స్థానికుల నుంచి వరుస ఫిర్యాదులు అందడంతో జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. ఉప్పల్ జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐటీ పోలీసుల సహకారంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా పలుచోట్ల అక్రమంగా అమర్చిన మోటార్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా జీఎం సంతోష్ కుమార్ మాట్లాడుతూ, జలమండలి సరఫరా చేసే నీరు ప్రతి ఇంటికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, అక్రమంగా మోటార్లు అమర్చి నీటిని లాగేవారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కనెక్షన్లు రద్దు చేస్తామన్నారు. ప్రజలు అక్రమ మోటార్లు గమనించిన వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

## పిపిఎస్ మోటార్స్‌ను ఆవిష్కరించిన ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య




**హయత్ నగర్, జూన్ 4 ( జనం సాక్షి)** హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ లో పి పి ఎస్ – ఎంజి షోరూమ్ ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య చేతుల మీదుగా జెఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా కొత్త ఫుల్‌సైజ్ “ఎస్ యు వీ ఎంజి మెజెస్టర్” ను ఆవిష్కరించారు. 4ఇ2 ఆటోమేటిక్ టాప్ ట్రిమ్ ధర రూ.40.99 లక్షలు కాగా, 4 డబ్ల్యూ డి వేరియంట్ ధర రూ.44.99 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ప్రకటించారు. ట్విన్ టర్బో డీజిల్ ఇంజిన్‌తో 215.5గ్రా శక్తి, 478.5 టీఎ టార్క్‌ను అందించే ఈ ఎస్ యు వీ లో 8-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, 10 ఆఫ్-రోడ్ మోడ్‌లు, ట్రిపుల్ డిఫరెన్షియల్ లాక్స్, 219 మి.మీ గ్రౌండ్ క్లియరెన్స్, 810 మి.మీ వాటర్ వేడింగ్ సామర్థ్యం వంటి ఫీచర్లు ఉన్నాయి. లెవల్-2 ఏ డి ఏ ఎస్, 360డిగ్రీ హెడ్డీ కెమెరా, వెంటిలేటెడ్ ఉ మసాజ్ సీట్లు, 3-జోన్ క్లైమేట్ కంట్రోల్, 12 జేబీఎల్ స్పీకర్ సౌండ్ సిస్టమ్, డ్యూయల్ వైర్‌లెస్ ఛార్జర్లు వంటి ప్రీమియం ఫీచర్లతో ఎం జి మెజెస్టర్ వినియోగదారులను ఆకట్టుకోనుంది. మూడు సంవత్సరాల అపరిమిత కిలోమీటర్ల వారంటీతో పాటు 70% వరకు బైబ్యాక్ హామీ కూడా కంపెనీ ప్రకటించింది.

## రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొన్న దళిత నాయకులు



**తలకొండపల్లి జూన్ 04 (జనంసాక్షి):** తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దళిత నాయకులతో గత రెండు రోజులుగా హైదరాబాదులో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి తలకొండపల్లి మండలం నుంచి మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు, సివిఎంసి కమిటీ చైర్మన్ డేవిడ్,జర్నలిస్ట్ సంఘం నాయకులు దరువుల శంకర్,అడ్వకేట్ సంఘాల నుంచి రమ్యులు హాజరైనారు.ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.రాష్ట్రస్థాయిలో హైదరాబాదులోని రామంతపూర్ లో గల ఎంజాయ్ మీటింగ్ హాల్లో నిర్వహించిన ఈ సమావేశంలో దళిత రాష్ట్ర నాయకులు నందగోపాలు, చిట్టిబాబులు హాజరై పలు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఇరువు రాష్ట్రాలలోని వందమంది దళిత సంఘాల, ప్రజాసంఘాల నాయకులకు శిక్షణ నిర్వహించి పలు చట్టాలపై సూచనలను సలహాలు చేశారు.అనంతరం ఆయన సంఘాల నాయకులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిబిఎస్ యు జిల్లా కార్యదర్శి జోగు రమేష్,మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు,సిబిఎంసి కమిటీ చైర్మన్ డేవిడ్,జర్నలిస్ట్ నాయకులు దరువుల శంకర్, సామాజిక కార్యకర్తలు కుమార్,చంద్రకళ,భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీకి విఫలయత్నం



**తలకొండపల్లి జూన్ 04(జనంసాక్షి):** మండలంలోని రాంపూర్ గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు.హుండీ తలుపులు తెరుచుకోకపోవడంతో వారి ప్రయత్నం విఫలమైంది.గురువారం ఉదయం ఆలయ అర్చకుడు సిహెచ్ నరసింహాచారి నిత్య పూజల కోసం దేవాలయానికి వెళ్లగా,ఆలయం వెనుక వైపు ఉన్న ప్రవేశ ద్వారం తాళాలు విరగొట్టి ఉండటాన్ని గుర్తించారు.వెంటనే స్థానికులు,గ్రామ సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్‌కు సమాచారం అందించారు.అనంతరం సర్పంచ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా,ఎస్సై శేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.దర్యాప్తులో భాగంగా దొంగలు హుండీ తాళాలు కూడా పగులగొట్టేందుకు ప్రయత్నించినప్పటికీ,హుండీ తలుపులు తెరుచుకోకపోవడంతో నగదు అపహరించకుండా అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. నిందితుల ను గుర్తించేందుకు క్లూస్ టీంను రంగంలోకి దించారు. ఆలయ ఈవో స్నేహలత సమక్షంలో హుండీని తెరిచి నగదు లెక్కించగా,అందులో సుమారు రూ.8 వేల వరకు నగదు ఉన్నట్లు వెల్లడైంది.ఈ సందర్భంగా ఎస్సై శేఖర్ మాట్లాడుతూ..దేవాలయాలు సహా ప్రజా ప్రాధాన్యత ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు సూచిస్తున్నప్పటికీ తగిన స్పందన రావడం లేదన్నారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు నివారించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు,ఆలయ కమిటీలు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత,ఉప సర్పంచ్ ఆంజనేయులు,ముదిరాజ్ సంఘం నాయకులు శేఖర్,పాండు,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.